దిన పత్రిక
తొలి సమయం
ఆదివారం , 26 - 4 -2026

## బదిలీ పై వచ్చిన వెంకటేష్ గౌడ్ని ఘనంగా సన్మానం చేసిన టిఆర్ఎస్ మండల్ టీం



తొలి సమయం పెబ్బేరు ఏప్రిల్ 25

లింగాల పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై పెబ్బేరు పోలీస్ స్టేషన్ కి వచ్చిన వెంకటేష్ గౌడ్ ని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వనం రాములు ఆధ్వర్యంలో, మండల్ టీం అందరు కలిసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. అందరు కలిసి స్వీట్స్ తినిపించడం జరిగింది. శాంతి భద్రతలను కాపాడాలని, నిస్పక్ష పాతంగా పని చేయాలని, అత్యంత నిబద్ధతతో, సమర్ధతతో, శ్రద్ధతో విధులు నిర్వర్తించి జిల్లా పోలీసు వ్యవస్థకు విశేష సేవలు అందించాలని, భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధతతో, విజయవంతమైన సేవలు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజశేఖర్ వెంకటయ్య మధు వడ్డె రమేష్ ఘట్టయ్య జూదం వెంకటేష్ లాలు కొండల్ బిచుపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జంగవాని గూడెంలో నూతన చలివేంద్రం ప్రారంభం



తొలి సమయం కొత్తగూడ 25 ఏప్రిల్ 2026

కొత్తగూడ మండలంలోని జంగవాని గూడెం (రాంపూర్) గ్రామపంచాయతీ బస్టాండ్ సమీపంలో గ్రామస్తులు మరియు ప్రయాణికుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన "చలివేంద్రం"ను స్థానిక సర్పంచ్ గొంది సోనీ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క ఆశీస్సులతో నిర్వహించబడింది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏజెన్సీ ప్రాంత ప్రజలు, బస్టాండ్ వద్ద వేచి ఉండే ప్రయాణికులు చల్లని మంచినీటిని సులభంగా పొందేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలకు ప్రతిరోజూ ఉపయోగపడే ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, గ్రామంలో అవసరాలను గుర్తించి ప్రజలకు ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపడుతున్న సర్పంచ్ గొంది సోనీ రాజును అభినందించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నాయకులు, మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, గ్రామస్తులు, యువజన నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ప్రారంభం



తొలి సమయం కొత్తగూడ 25 ఏప్రిల్ 2026

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా పాకాలకొత్తగూడలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్లో శనివారం సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఏటిడీవో () కొత్తగూడ ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్ను ప్రారంభించారు. ఈ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ఈ నెల 25వ తేదీ నుండి మే 9వ తేదీ వరకు నిర్వహించబడనుంది. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, హ్యాండ్బాల్, బాస్కెట్బాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల విద్యార్థులకు క్రీడల్లో మెరుగైన అవకాశాలు కల్పించడమే ఈ క్యాంప్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వో డి. సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ చి. కొమ్మాలు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బి. దేవులాల్, పీటీలు ఈ. దేవేందర్, ఎం. ప్రవీణ్, కోచ్లు డి. ధనాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఫోర్స్మెంట్ దాడులు..

## 1000 కిలోల నల్లబెల్లం, నాటుసారాయి స్వాధీనం



తొలి సమయం కొత్తగూడ 25 ఏప్రిల్ 2026

గుడుంబా మరియు మత్తు పదార్థాల రహిత తెలంగాణ లక్ష్యంతో ప్రొహిబిషన్స్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ తెలంగాణ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. శాఖ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఆదేశాలు, జాయింట్ కమిషనర్ ఎన్ఫోర్స్మెంట్ & డిప్యూటీ కమిషనర్ వరంగల్ శ్రీ జి. అంజన్రావు సూచనల మేరకు ఈ నెల 21 నుంచి తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎన్ఫోర్స్మెంట్ వరంగల్ బృందానికి వచ్చిన విశ్వసనీయ సమాచారంతో ఇందిరానగర్ తండా మట్టేవాడ మార్గంలో రాత్రి గస్తీ, వాహన తనిఖీలు నిర్వహించారు. 26 3009 నంబర్ గల గూడ్స్ క్యారియర్ను ఆపి తనిఖీ చేయగా, గుడుంబా తయారీలో ఉపయోగించే 1000 కిలోల నల్లబెల్లం, 100 కిలోల పటిక, 20 లీటర్ల నాటు సారాయి లభ్యమయ్యాయి. వాహనంతో పాటు సరుకును స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మహబూబాబాద్ మండలం పూరి తండాకు చెందిన భూక్య వీరేందర్, గూడూరు మండలం ఇందిరానగర్ తండాకు చెందిన గోగులోత్ రవీందర్ బీదర్ ప్రాంతం నుంచి తక్కువ ధరకు నల్లబెల్లం, పటిక తెచ్చి తండాల్లో అధిక ధరకు విక్రయించడం, అక్కడి నుంచి నాటుసారాయి సేకరించి పట్టణాల్లో అమ్ముతున్నట్లు అంగీకరించారు. అనంతరం నిందితులు, వాహనం, స్వాధీనం చేసిన సరుకును గూడూరు ఎక్సైజ్ స్టేషన్కు అప్పగించారు.

తదుపరి రాత్రి రూట్ వాచ్లో సర్వపురం తండాకు చెందిన భూక్య రమేష్ వద్ద నుంచి 6 లీటర్ల నాటుసారాయి మరియు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వా ధీనం చేసి కేసు నమోదు చేశారు. నాటుసార తయారీ, రవాణా, ముడి పదార్థాల సరఫరా, అలాగే గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. డ్రగ్స్ మరియు గుడుంబా రహిత రాష్ట్ర లక్ష్యానికి మీడియా, ప్రజలు, యువత సహకరించాలని ఎక్సైజ్ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ దాడుల్లో వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ ఏసీ కార్యాలయం మరియు గూడూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రిడిటేషన్ల జారీకి కుట్ర

**జీవో 252 బుట్ట దాఖలు చేస్తున్న సమాచార శాఖ**

**పెద్ద పత్రికలకు ఉదారతచిన్న పత్రికలపై వేటు**

**జీవో ఇష్టం వచ్చినట్లు మార్చే అధికారం ఎవరిచ్చారు?**

**జీవో ప్రకారం అక్రిడిటేషన్లు ఇవ్వకపోతే న్యాయపోరాటం తప్పదు**

**డబ్ల్యూజేఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్**

తొలి సమయం కరీంనగర్, ఏప్రిల్, 24:

రాష్ట్రంలో జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ పూర్తి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అక్రిడిటేషన్ల జారీకి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252 అపహాస్యం పాలవుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సంఘానికి సంబంధించిన నేతల ఒత్తిళ్లకు తలవొగ్గిన సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు సాక్షాత్తు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తుంగలో తొక్కడం ఎంత మేరకు సమర్థనీయం కాదన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం జారీ చేసే అక్రిడిటేషన్లకు సంబంధించి జరిపిన సమావేశాలలో ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా నిర్ణయాలు జరిగాయని, జీవోకు విరుద్ధంగా జారీ చేసే అక్రిడిటేషన్ల ప్రక్రియనుఅడ్డుకొని తీరుతామని ఆయన హెచ్చరించారు. అక్రిడిటేషన్ జీవో కచ్చితంగా అమలు చేయాల్సి ఉండగా, అందులో మార్పులు చేర్పులు చేసే అవకాశం, అధికారం రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్ కమిటీకి, సమాచార శాఖ కమిషనర్ కు, మీడియా అకాడమీ చైర్మన్ కు లేదని కరుణాకర్ స్పష్టం చేశారు. అలా మార్పులు చేసే అవకాశం లేనప్పుడు రాష్ట్రస్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో జీవో కు విరుద్ధంగా నిర్ణయాలు ఎందుకు జరిగాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల ప్రక్రియ జీవో ఎంఎస్ 252 ఆధారంగానే జరుగుతున్నదా?



అలా అయితే, ఏబీసీ/ పీఆర్జీఐ/ ఆర్ఎన్ఐ ఆమోదిత సర్క్యులేషన్ సర్టిఫికేట్లు లేని పెద్ద () మధ్యతరహా వార్తా పత్రికలకు అక్రిడిటేషన్లు ఎలా మంజూరు చేయబడుతున్నాయని, దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత సమాచార శాఖ అధికారులపైనే ఉందన్నారు. జీవో ఎంఎస్ 252లో పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం, పెద్ద పత్రికల కేటగిరి లోని దినపత్రికలు ఏబీసీ/ పీఆర్జీఐ/ ఆర్ఎన్ఐ సర్క్యులేషన్ సర్టిఫికేట్ సమర్పించకపోతే, ఏ ప్రాతిపదికన వాటికి అక్రిడిటేషన్లు ఇవ్వబడుతున్నాయో స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద,మధ్యతరహా వార్తాపత్రికలతో పోలిస్తే చాలా తక్కువగా అక్రిడిటేషన్లు పొందుతున్న చిన్న వార్తాపత్రికలకు మాత్రమే సదరు జీవోను వర్తింప చేయడం చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం చేసినట్లేనని ఆయన అన్నారు. జీవో ఎంఎస్ 252లో పేర్కొన్న విధంగా సర్క్యులేషన్ 25000 కంటే ఎక్కువ ఉంటే ఏబీసీ/పీజీఆర్ఐ/ఆర్ఎన్ఐ ఆమోదిత ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. సదరు జీవోను ఉల్లంఘిస్తూ, అక్రిడిటేషన్ కమిటీ పెద్ద మరియు మధ్యతరహా వార్తాపత్రికలకు అక్రిడిటేషన్లను ఆమోదించినట్టుగా తమకు సమాచారం ఉందన్నారు. జీవో ఎంఎస్ 252ను ఉల్లంఘించి, దానికి వ్యతిరేకంగా ఆమోదాలు ఇచ్చే అధికారం అక్రిడిటేషన్ కమిటీకి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. జీవో ఎంఎస్ 252లో పేర్కొన్న విధంగా సర్క్యులేషన్ సర్టిఫికేట్ను ధృవీకరించుకోకుండా, పెద్ద మరియు మధ్య తరహా వార్తాపత్రికలకు ఏ ప్రాతిపదికన అక్రిడిటేషన్ ఇస్తున్నారని ప్రశ్నించారు. కొన్ని పెద్ద,మధ్యతరహా వార్తాపత్రికలు డీఏవీపీ/సీబీసీలో అతి తక్కువ సర్క్యులేషన్ను చూపిస్తూ, సమాచార శాఖలో మాత్రం ప్రకటనల రేట్లు, అక్రిడిటేషన్ ప్రయోజనాల కోసం అంతకు పెద్ద సంఖ్యలో సర్క్యులేషన్ వివరాలు చూపిస్తున్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఏజెన్సీలకు వేర్వేరు సర్క్యులేషన్ను చూపిస్తూ మోసం చేస్తున్న పత్రికల విషయంలో సమాచార శాఖ నిబంధనలు ఎందుకు పాటించడం లేదని ఆయన అన్నారు.

## బైక్ను ఢీకొట్టిన కారు, ఒకరికి గాయాలు



తొలి సమయం కొత్తగూడ 25 ఏప్రిల్ 2026

గూడూరు మండల కేంద్రంలో సబ్స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్పై ప్రయాణిస్తున్న గూడూరు మండలం కొల్లాపురం గ్రామానికి చెందిన చెలమల్ల వెంకటేశ్వర్లు గాయపడినట్లు తెలిసింది. సాక్షుల వివరాల ప్రకారం, వేగంగా వచ్చిన కారు బైక్ను ఢీకొనడంతో వెంకటేశ్వర్లు రోడ్డుపై పడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని రక్షించి సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందుతున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంతో కొంతసేపు ఆ ప్రాంతంలో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ను సవ్యంగా మళ్లించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉండగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. స్థానికులు జాతీయ రహదారిపై వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని కోరుతున్నారు

## మన అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా స్వీయ గణనలలో పాల్గొనాలి

**ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు జనగణలో పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలి**

**ఏప్రిల్ 26 ఆదివారం నుండి మే 11 వరకు స్వీయ గణన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి**

**ప్రభుత్వం భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**

**మన ఇసుక మన వాహనం పథకం ఆన్లైన్ విధానం ద్వారా మాత్రమే ఇసుక కేటాయింపులు చేయాలి**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



తొలి సమయం మహబూబాబాద్ ఏప్రిల్ 25

ఎంత ఇయ్యాలశనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, సంబంధిత అధికారులతో మన జనగణన, మన అభివృద్ధి, స్వయం గణన, ప్రభుత్వ భూముల పరిరక్షణ, సాదా బయినామాల పరిశీలన, మన ఇసుక వాహనం పథకం అమలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద ప్రజా భాగస్వామ్య కార్యక్రమం జనాభా గణన 2027, కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26 ఆదివారం నుండి మే 10 వరకు జిల్లాలో స్వయం గణన కార్యక్రమం కొనసాగుతుందని ఇందులో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు, ఇండ్ల జాబితా గణన, జనాభా గణన మొదటి దిశ మే 11, 26 నుండి జూన్ 9 26 వరకు (30) రోజులు కొనసాగుతుందని, ప్రతి ఇంటి సమాచారం నమోదు చేయబడుతుందని, ఇంటి పరిస్థితి సౌకర్యాలు ప్రాథమిక సమాచారం సేకరించబడుతుందన్నారు, స్వీయ గణన ఆన్లైన్ పోర్టల్ (...) వెబ్సైటును సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే గణనలో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినప్పుడు మీ ఐడి తెలియపరచాలని తెలిపారు, జనగణన వల్ల ప్రతి ఒక్కరి భవిష్యత్తు కార్యచరణ విధానాలకు ఖచ్చితమైన ఆధారం, వనరుల సరి అయిన పంపిణీ, ప్రణాళికలు, మెరుగైన సౌకర్యాలు పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, తమ ప్రాంతాల అభివృద్ధికి సహాయ, సహకారాలు పథకాల అమలు జనాభా గణాంకాలు ద్వారా వెల్లడించడం జరుగుతుందన్నారు,మీ సమాచారం పూర్తిగా సురక్షితంగా ఉంటుందని, జనాభా లెక్కల చట్టం 1948 ప్రకారం మీ సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని, పేర్లు గుర్తింపు బహిర్గతం చేయబడవు, పనులు లేదా ఇతర ఏ దర్యాప్తుల ప్రయోజనాల కోసం ఈ సమాచారాన్ని ఉపయోగించబడదన్నారు, సర్వే సిబ్బంది గుర్తించబడిన వారు వచ్చినప్పుడు ఖచ్చితమైన సంపూర్ణమైన వివరాలు ఇవ్వాలని, మీరు సరియైన సమాచారం భవిష్యత్తులో అనేక విధాలుగా ఉపయోగపడుతుందని జనాభా గణనలో గర్వంగా పాల్గొనాలని, దేశ అభివృద్ధికి సహకరించాలని అన్నారు,జిల్లాలో ఈ జనాభా గణన కార్యక్రమం నిర్వహణ కోసం సుమారు (1764) మంది సిబ్బందిని నియమించడం జరిగిందని వారికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి చేయడం జరిగిందనీ, ఇప్పటికే ప్రింటర్ ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా తదితర సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందని, మరింత ప్రచారం నిర్వహించి ఈ జనాభా గణన కార్యక్రమాన్ని చేయడం కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు, ప్రతి ఒక్క అధికారి మండల స్థాయి అధికారి వారికి కేటాయించిన ప్రకారం సర్వే సిబ్బందికి సహకరిస్తూ ఉండాలని సూచించారు, జిల్లాలోని ప్రభుత్వ భూములను పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అక్రమంగా అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు, సాదా బైనామాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు, మన ఇసుక మన వాహనం పథకం ద్వారా ఆన్లైన్ లో మాత్రమే ఇసుక విక్రయాల కూపన్లను పంపిణీ చేయాలని ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు, ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, అన్ని మండలాల తహసిల్దార్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్గోపాల్,దామోదర్, పాల్గొన్నారు.